సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 28 । మే । 2025



మా ఆందోళన ఎవరికీ పట్టదా?

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఇంజినీరింగ్ వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


8లో



రత్నగిరిపై పడకేసిన రక్షణ

అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సెక్యూరిటీ పడకేసింది. కీలక విభాగాల్లో ఒక్క సెక్యూరిటీ గార్డు కూడా కనిపించడం లేదు.

కడలిలోకి 10,778 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 10,778 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.40 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

ఇసుక అక్రమ తవ్వకాల వల్లే యువకుల మృత్యువాత

మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి : సీపీఎం

అమలాపురం టౌన్: ఇసుక మాఫియా అక్రమ తవ్వకాల వల్లే కమిని లంక గ్రామంలో గోదావరి పాయలో 8 మంది యువకులు గల్లంతై మృత్యువాత పడే దుస్థితి దాపురించిందని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ యువకుల చావులకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా సీపీఎం నాయకులు బృందం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘటనా స్థలాన్ని మంగళవారం సందర్శించింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు అమలాపురంలో మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఇసుక మాఫియా ఆగడాలు, ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తారు. 8 మంది యువకులు గోదావరిలోకి స్నానాలకు వెళ్లి మృతి చెందారంటే ముమ్మాటికీ ఇసుక మాఫియా అక్రమ తవ్వకాల వల్ల ఏర్పడిన అంచనా తెలియని లోతుతో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సీపీఎం బృందం డిమాండ్ చేసింది.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

అమలాపురం టౌన్: గత ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాని ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జనరల్, ఒకేషనల్ పరీక్షలు బుధవారం నుంచి జూన్ 1వ తేదీ వరకూ జరుగుతాయని డీఐఈవో వనము సోమశేఖరరావు తెలిపారు. ఈ పరీక్షలు రాసే విద్యార్థులకు కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకూ ఒక పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మరో పరీక్ష నిర్వహిస్తారని ప్రకటనలో తెలిపారు.


నిధుల కేటాయింపులో ప్రాధాన్యమివ్వాలి



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణు గోపాలరావు, జెడ్పీటీసీ సభ్యులు

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు జెడ్పీటీలకు తెలియకుండా ఎన్ఆర్‌జీఎస్ జెడ్పీ నిధులు కేటాస్తున్నారు, ఇలా అయితే ప్రజలకు ఏం సమాధానం చెప్పాలంటూ కోనసీమ జిల్లా చెందిన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు కలెక్టర్ వద్ద ఆవేదన వెలిబుచ్చారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో వారు మంగళవారం కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, జెడ్పీ విడుదల చేసే 15 శాతం నిధులు, ఆర్‌డబ్ల్యూఎస్ పనుల్లో కనీసం తమకు సమాచారం ఇవ్వడం లేదని వివరించారు. ప్రభుత్వంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆహ్వానాలు పంపించడం లేదని తెలిపారు. ప్రత్యక్షంగా ఎన్నికైన తమకు ప్రాధాన్యం ఇవ్వకపోతే ఎలా అని అన్నారు. తమ జెడ్పీ నిధులు కూడా తమకు తెలియకుండా ఎమ్మెల్యేలు చెప్పిన పనులకు ఎంపీడీవోలు, అధికారులు ఆమోదం తెలుపుతున్నారని అన్నారు. జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ నిధుల కేటాయింపులో జెడ్పీటీసీ సభ్యులకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జెడ్పీటీసీ సభ్యులు పందిరి రామ్‌గోపాల్, గెద్దం సంపతిరావు, కోనుకు గౌతమి, మట్టా శైలజ, కసిరెడ్డి అంజిబాబు, బూడిద వరలక్ష్మి, కూడుపూడి శ్రీనివాస్, కూడుపూడి భారతి, వి.వీర వెంకట సూర్యనారాయణ (అబ్బు), బోణం సాయిబాబా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కోవిడ్ వార్డు ఏర్పాటు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు అప్రమత్తమవుతున్నారు. ముందు జాగ్రత్తగా రాజమహేంద్రరం ప్రభుత్వాసుపత్రిలో 20 పడకలతో కోవిడ్ వార్డును సిద్ధం చేశారు. ఈ వార్డులో ఆక్సిజన్ సరఫరా ఏర్పాటు చేశారు. వెంటిలేటర్‌ను అందుబాటులో ఉంచారు. రోగులకు వ్యాధి లక్షణాలను బట్టి అవసరమైతే కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు. పూర్వపు క్యాంటీన్ ప్రాంతంలో కోవిడ్ పరీక్షలు నిర్వహించేందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ చర్యలు చేపట్టారు.



వృద్ధ గౌతమి గోదావరిలో గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న పోలీసులు



తాతపూడి నితీష్, వడ్డి రమేష్, కులపాక వీరవెంకట రోహిత్, ఎలమర్తి సాయి మహేష్, సబ్బతి పాల్ అభిషేక్, ఎలిపే మహేష్, వడ్డి మహేష్ మృతదేహాలు

కన్నీటి మసకలో కడసారి చూపులు

నిండా ఇరవై ఏళ్లు లేవు. ఇంకా నూనూగు మీసాలు రాలేదు. వారిలో కొందరికి ఈత రాదు. కాని ఏమీ బుద్ధి పుట్టిందో తెలియదు. అందరూ కలిసి గౌతమీ గోదావరిలో స్నానాలకు వెళ్లారు. గోదారి తల్లి వారిని నిర్దాక్షిణ్యంగా తనలో కలిపేసుకుంది. ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ శివారు సలాదివారిపాలెంలో స్నానాలకు వెళ్లి సోమవారం గల్లంతైన ఎనిమిది మందిలో ఏడుగురు విగత జీవులై తేలారు. అన్నపానీయాలకు ఆలవాలమైన గోదారమ్మ తల్లికి ఏం కోపం వచ్చిందో తెలియదు కాని... ఏడు కుటుంబాలకు గర్భ శోకాన్ని మిగిల్చింది.

- బావురుమంటున్న బాధిత కుటుంబాలు
- ఆరు కుటుంబాలలో పెను విషాదం నింపిన గోదావరి స్నానాలు
- ముమ్మిడివరం మండలం కమిని వద్ద ఘటన
- సోమవారం స్నానాలకు వెళ్లిన పదకొండు మందిలో ఎనిమిది మంది గల్లంతు
- ఏడుగురి మృతదేహాలు లభ్యం
- గోదావరి పాయలలో విస్తృత గాలింపు
- పాల్గొన్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, పోలీసులు, రెవెన్యూ అధికారులు
- శుభ కార్యక్రమం నిర్వహించినవారి ఇంట విషాద ఛాయలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తదితరులు



ఘటనా స్థలంలో గాలింపు చర్యలు చేపడుతున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సభ్యులు

సాక్షి, అమలాపురం/ ముమ్మిడివరం/ తాళ్లరేవు/ కాట్రేనికోన: గోదావరి తీరం శోక సంద్రంగా మారింది. గోదావరి ఒడిలో గల్లంతైన తమ బిడ్డలు ఎలాగోలా ఒడ్డుకు చేరుకుంటారని తెల్లవార్లూ ఎదురు చూసిన ఆ కుటుంబ సభ్యులకు తీవ్ర నిరాశే మిగిలింది. జిల్లా యంత్రాంగం మంగళవారం తెల్లవారు జాము నుంచి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టింది. యానాంకు చెందిన గజ ఈతగాళ్లు, పోలీస్ యంత్రాంగంతో పాటు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ఆరు స్పీడ్ బోట్‌ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. ఒక్కొక్క యువకుడి మృతదేహం లభ్యం కావడంతో ఆ ప్రాంతమంతా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల రోదనలతో హృదయ విదారకంగా మారింది. కె.గంగవరం మండలం శేరిలంకలో స్నేహితుడు సోదరి ఓణీల ఫంక్షన్‌కు వెళ్లి సోమవారం గోదావరిలో ఎనిమిది మంది యువకులు గల్లంతైన విషయం తెలిసిందే. తమ బిడ్డల ఆచూకీ కోసం రాత్రంతా కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూసినా చివరకు వారు విగత జీవులుగా కనిపించడంతో కన్నీరు, మున్నీరుగా విలపించారు. ఐ.పోలవరం మండలం జి.మూలపాలెం పంచాయతీ శివారు ఎర్రగరువు గ్రామానికి చెందిన వడ్డి మహేష్(15) మృతదేహం తొలుత లభ్యమైంది. తరువాత కాకినాడ తూరంగికి చెందిన యలమర్తి సాయి మహేష్ (20), కాకినాడ గోళీలపేటకు చెందిన సబ్బతి పాల్ అభిషేక్ (18), కె.గంగవరం మండలం శేరిలంక గ్రామానికి చెందిన ఎలిపే మహేష్(15), మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన కులపాక రోహిత్(19), కరప మండలం గురజనాపల్లికి చెందిన తాతపూడి నితీష్ (18), ఐ.పోలవరం మండలం ఎర్రగరువు గ్రామానికి చెందిన వడ్డి రాజేష్ (18) మృతదేహాలు లభ్యమయ్యాయి. కాకినాడకు చెందిన చర్చి పాస్టర్ కుమారుడు సబ్బతి క్రాంతి ఇమ్మానుయేల్ (19) ఆచూకీ ఇంకా తెలియరాలేదు. ఆయా మృతదేహాలను అంబులెన్స్‌లో ఎప్పటికప్పుడు ముమ్మిడివరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సాయిశృతి ఆధ్వర్యంలో డాక్టర్ నిఖిత, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ కౌశిక్ పోస్టుమార్టమ్ నిర్వహించిన అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. రామచంద్రపురం డీఎస్పీ ఎం.రఘువీర్, అమలాపురం డీఎస్పీ టి.ఆర్.ఎస్.కె. ప్రసాద్, అమలాపురం, రామచంద్రపురం ఆర్డీఓలు మాధవి, డి.అఖిల పరిస్థితి సమీక్షించారు.

దురదృష్టకర ఘటన

శేరిలంకలో జరిగిన ఘటన చాలా దురదృష్టకరమైనదని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ అన్నారు. 20 ఏళ్ల లోపు యువకులు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. స్నేహితులు ఆటవిడుపుగా ఇక్కడకు వచ్చి ఈ విధంగా మృత్యువాత పడడం చాలా దురదృష్టకరమైన ఘటన అన్నారు. గోదావరి లోపలికి వెళ్లడం, ఈత రాకపోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుందని వారు అభిప్రాయపడ్డారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వీరిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు ఢిల్లీ నారాయణ, చింతలపాటి శ్రీనురాజు, ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, నాయకులు కోలా బాబ్జి తదితరులు ఉన్నారు.

గురజనాపల్లిలో విషాద ఛాయలు

కరప: స్నేహితులతో కలసి స్నానానికి వెళ్లి గల్లంతైన వారిలో తాతపూడి నితీష్‌కుమార్(18)ది కరప మండలం గురజనాపల్లి గ్రామం. అతని తండ్రి ఆటోడ్రైవర్, తల్లి వరలక్ష్మి గృహిణి. వీరికి సుచిత్ర, భానులత ఇద్దరు కుమార్తెలు, కుమారుడు నితీష్. నితీష్ కాకినాడలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుకుంటూ, కాకినాడ జగన్నాధపురంలోని ఒక చర్చిలో గిటారిస్ట్‌గా నైపుణ్యం సాధించాడు. నితీష్ అకాల మరణంతో గురజనాపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో కలుపుగోలుతనంగా ఉండే నితీష్ లేడని తెలుసుకున్న స్నేహితులు, బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. నితీష్ గల్లంతైన విషయం తల్లి వరలక్ష్మికి తెలియనివ్వలేదు. శవపంచనామా తర్వాత గురజనాపల్లి తీసుకొచ్చిన కుమారుడి మృతదేహం చూసి ఆమె గుండెలు అవిసేలా విలపించింది. చదువుకుని ప్రయోజకుడు అవుతాడని గంపెడాశలు పెట్టుకున్న ఆ తల్లి రోదనకు అక్కడివారు కన్నీటి పర్యంతమయ్యారు. తదనంతరం నితీష్‌కుమార్ మృతదేహం వద్ద అతని కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఖననం చేశారు.

ఉన్నత చదువు చదువుతాడనుకున్నాను



ముమ్మిడివరం ఆస్పత్రి వద్ద కుమారుడు మృతదేహాన్ని చూసి విలపిస్తున్న ఎలుమర్తి ప్రసాద్

తన కుమారుడు ఉన్నత చదువు చదివి ప్రయోజకుడవుతాడని కలలు కన్నాను. ఇంతలోనే ఇలా జరిగిపోయిందంటూ ఎలుమర్తి సాయి మహేష్ తండ్రి ప్రసాద్ కంటతడి పెట్టుకున్నారు. తనకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు ఇంజినీరింగ్ పూర్తి చేశాడని, రెండవ కుమారుడైన సాయి మహేష్ ఒంగోలులో ఫిజియోథెరపీ కోర్సు చేస్తూ నీట్‌కి ప్రిపేర్ అవుదామనుకున్నాడని, ఉన్నత చదువులు చదువుతాడనుకున్నాను. పది రోజులు సెలవులు కావడంతో ఇంటికి వచ్చాడని స్నేహితుని శుభకార్యానికి వెళతానని చెప్పి వచ్చి తన కుమారుడు గోదావరిలో కలిసిపోయాడంటూ విలపించారు.



ముమ్మిడివరం ప్రభుత్వాస్పత్రి వద్ద మనుమల మృతదేహాలను చూసి విలపిస్తున్న భావమ్మ

మాతృమూర్తులకు దక్కని కన్నబిడ్డల చివరి చూపు

అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ బిడ్డల కడసారి చూపు కూడా ఆ మాతృమూర్తులకు దక్కలేదు. శేరిలంక గ్రామానికి చెందిన కొండేపూడి కుటుంబానికి చెందిన ఆడపడచులు వెంకటలక్ష్మి, భవానీల కుమారులు ఈ ఘటనలో మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో మృతి చెందిన ఎలిపే మహేష్ శేరిలంకలో అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ పశువుల్లంక పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. తన కుమారునికి బంగారు భవిష్యత్ ఇవ్వాలనే ఉద్దేశంతో మహేష్ తల్లి వెంకటలక్ష్మి కువైట్‌లో ఉద్యోగం చేస్తోంది. అయితే కుమారుడు అర్ధంతరంగా మృతి చెందడంతో ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. కుమారుడు మృతి చెందినా ఇక్కడకు వచ్చే పరిస్థితులు లేవని కుటుంబ సభ్యుల వద్ద ఫోన్‌లో బోరున విలపించింది. ఎర్రగరువు గ్రామానికి చెందిన వడ్డి భవానీ, భైరవస్వామి ఇద్దరు కుమారులు వడ్డి మహేష్, వడ్డి రాజేష్ కూడా ఈ ఘటనలో దుర్మరణం పాలయ్యారు. భవానీ కూడా పొట్టకూటి కోసం కువైట్‌లో ఉంటోంది. ఆమెది కూడా పిల్లల్ని కడసారి చూపు కూడా చూసుకోలేని దుస్థితి. పిల్లలను సాకుతున్న కొండేపూడి భావమ్మ మనుమల మృతదేహాల వద్ద గుండె పగిలేలా విలపించడం చూపరులకు కంటతడి పెట్టించింది.

అన్నయ్యా.. నాకు దిక్కెవరు



ముమ్మిడివరం ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బిందుమాధవి తదితరులు

అన్నయ్యా.. నాకు దిక్కెవరంటూ గోదావరిలో గల్లంతైన కులపాక వీర వెంకట రోహిత్ చెల్లెలు బిందు మాధవి బోరున విలపించింది. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన రోహిత్ చెల్లెల కోసం తన చదువును పదవ తరగతిలోనే ముగించి స్థానికంగా ఉన్న ఒక రైస్ మిల్లులో పని చేస్తున్నాడు. బిందు మాధవి ఇంటర్మీడియెట్ చదువుతోంది. పెద్ద దిక్కులేని వీరిద్దరూ పెద్దమ్మ, పెదనాన్నలైన నక్కా సుజాత, గోవిందరాజుల వద్ద పెరుగుతున్నారు. చెల్లెల్ని ఉన్నత చదువులు చదివించాలన్న తన కోరిక తీరకుండానే అనంతలోకాలకు వెళ్లిపోయాడు. దీంతో చెల్లెలు బిందు మాధవితోపాటు పెద్దమ్మ, పెదనాన్నలు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

ఎవరి కోసం బతకాలి

ఇద్దరు కొడుకులను ఆ దేవుడు ఒకేసారి తీసుకుపోయాడు. ఇంక నేను ఎవరి కోసం బతకాలి అంటూ సబ్బతి పాల్ అభిషేక్ మృతదేహాన్ని చూసి తండ్రి రమేష్ అలియాస్ రఘు గుండెల అవిసేలా రోదించాడు. రమేష్‌కు పాల్ అభిషేక్, క్రాంతి ఇమ్మానుయేల్ ఇద్దరు కుమారులు. ఈ ఘటనలో గల్లంతు అయిన పాల్ అభిషేక్ మృతదేహం లభ్యంకాగా ముమ్మిడివరం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని చూసి రమేష్ బోరున విలపిస్తూ పెద్ద కుమారుడు క్రాంతి ఇమ్మానుయేల్ ఫంక్షన్‌కు వెళుతున్నాను డాడీ, డబ్బు కావాలి ఫోన్ పే చేయమని అడగగా ఫోన్‌పే చేశాను. కానీ చిన్న కుమారుడు పాల్‌తో చివరిసారిగా మాట్లాడలేకపోయానంటూ వాపోయారు. పెద్ద కుమారుడు ఆరడగుల ఆజానుబాహుడు కావడంతో పోలీస్ ట్రైనింగ్‌కి వెళితే సెలెక్ట్ అవుతావని ప్రోత్సహించేవాడినని, తన కుమారుల కోసం తన భార్య పండ్లు, తినుబండారాలు సిద్ధం చేసి ఉంచేదని, ఆమెకు నేను ఏమి చెప్పాలి అంటూ తల్లడిల్లిపోయారు. వారికి ఈతరాకున్నా ఎందుకు గోదావరిలో దిగారో తెలియడం లేదన్నారు.



ముమ్మిడివరం ప్రభుత్వాస్పత్రి వద్ద కుమారుడు మృతదేహాన్ని చూసి బోరున విలపిస్తున్న రమేష్

కుటుంబాన్ని పోషిస్తాడనుకుంటే కడతేరిపోయాడు

ఉన్నత చదువులు చదివి కుటుంబాన్ని పోషిస్తాడు అనుకుంటే చదువు పూర్తికాకుండానే తన కుమారుడు కడతేరిపోయాడని ఒక తండ్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరిలో గల్లంతై మృతిచెందిన తాతపూడి నితీష్ తండ్రి రాజును వారించడం అక్కడివారి వల్ల కాలేదు. తన కుమారుడు బీఎస్సీ యానిమేషన్ కోర్సు చదువుతూ తనకు ఆసరాగా ఉంటున్నాడని ఇటీవల ఆర్థిక పరిస్థితి బాగా లేక తాను ఫీజు కట్టలేనని చెప్పగా డాడీ నా ఫీజు నేనే కట్టుకుంటానని చెప్పి ఈవెంట్స్ చేసి తన ఫీజులు తానే కట్టుకుంటున్నాడని వాపోయారు. కుటుంబాన్ని ఆదుకుంటాడని, తన కుమార్తెలిద్దరికీ పెద్ద దిక్కుగా ఉంటాడని అనుకున్నానని, అంతలోనే అర్ధంతరంగా మృతి చెందాడని రోదిస్తూ చెప్పారు. ఇక్కడి ఫంక్షన్‌కు రాకుండా ఉంటే నా కొడుకు బతికి ఉండేవాడని విలపించారు.



కుమారుని మృతితో బోరున విలపిస్తున్న తాతపూడి రాజు

తల్లడిల్లుతున్న తల్లి పేగు

- వశిష్ట నదీపాయలో ముగ్గురు విద్యార్థుల గల్లంతు
- మూడు కుటుంబాల్లోనూ ఏకైక కుమారులే

పి.గన్నవరం: గోదావరి పాయలో మంగళవారం సరదాగా స్నానానికి వెళ్లిన ముగ్గురు విద్యార్థులు నీట మునిగి గల్లంతు కావడం వారి కుటుంబాల్లో పెను విషాదం నింపింది. వీరిలో ఇద్దరు వారి కుటుంబాల్లో ఏకైక సంతానం కాగా, మరొకరికి అక్క ఉంది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆయా కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తారన్న కుమారులు నీట మునిగి గల్లంతు కావడంతో వారి తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

పి.గన్నవరం మండలం నాగుల్లంక గ్రామానికి చెందిన కేతా ప్రవీణ్ (15), సానబోయిన సూర్యతేజ (12), పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం పెదలంక గ్రామానికి చెందిన నీతిపూడి పాలు కుమార్ (15), మరో ఇద్దరు విద్యార్థులు కలిసి సాయంత్రం వరకూ నాగుల్లంకలో ఆడుకున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో నాగుల్లంకకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం రావిలంకలో వశిష్ట నదీపాయలో సరదాగా స్నానం చేసేందుకు సైకిళ్లపై వెళ్లారు. పెదలంకకు చెందిన నాగుల్లంకలోని మేనమామ సానబోయిన ఏడుకొండలు ఇంటికి నెల రోజుల క్రితం పాలుకుమార్ వచ్చాడు. నదీలో స్నానం చేస్తున్న ప్రవీణ్, సూర్యతేజ, పాలుకుమార్‌లు నీట మునిగిపోవడంతో మిగిలిన ఇద్దరు బాలురు భయాందోళనకు గురై అక్కడి నుంచి పరారీ అయ్యారు. వారి వివరాలు తెలియరాలేదు. ప్రమాద స్థలానికి సమీప లంకల్లో పనిచేస్తున్న కూలీలు.. నీట మునుగుతున్న విద్యార్థులను గమనించి, అక్కడికి చేరుకునే సరికే వారు మునిగిపోయారు. విద్యార్థుల దుస్తుల్లో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకుని బోరున విలపించారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, పశ్చిమగోదావరి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి



సంఘటన స్థలంలో సూర్యతేజ తండ్రి ఏడుకొండలు



విషాదంలో ప్రవీణ్ తండ్రి వెంకటేశ్వరరావు

నాగుల్లంకలో విషాద ఛాయలు

ముగ్గురు విద్యార్థులు గల్లంతు కావడంతో నాగుల్లంక గ్రామంలో విషాయ ఛాయలు అలముకున్నాయి. కేతా ప్రవీణ్ ఇటీవల పదో తరగతి పాసయ్యాడు. అతడి తండ్రి వెంకటేశ్వరరావు తాపీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి సరోజిని గృహిణి. వీరి మొదటి కుమారుడు ఏడాది వయసులోనే మరణించడంతో రెండో కుమారుడైన ప్రవీణ్‌ను అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. ప్రవీణ్ గల్లంతు కావడంతో వారు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. సానబోయిన సూర్యతేజ తండ్రి ఏడుకొండలు వడ్రంగి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి దుర్గాభవాని గృహిణి. వీరికి ఏకైక సంతానమైన సూర్యతేజ నీట మునిగి గల్లంతు కావడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. పెదలంకకు చెందిన పాలుకుమార్ నెలరోజుల క్రితం నాగుల్లంకలోని మేనమామ సానబోయిన ఏడుకొండలు ఇంటికి వచ్చాడు.

కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు

రాజోలు: పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం పెదలంకలో విషాద ఛాయలు నెలకొన్నాయి. పెదలంక గ్రామానికి చెందిన 15 ఏళ్ల నీతిపూడి పాలుకుమార్ ఆచంట మండలం అయోధ్యలంక శివారు రావిలంక వద్ద గోదావరిలో మంగళవారం గల్లంతయ్యాడు. 15 ఏళ్ల క్రితం పాలుకుమార్ తండ్రి నాని రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ప్రస్తుతం కుమారుడు పాలుకుమార్ గోదావరిలో గల్లంతు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పాలుకుమార్ తల్లి నాగలక్ష్మి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లగా నాన్నమ్మ వద్ద ఉంటున్నాడు. రాజోలు మండలం తాటిపాక మఠం గ్రామానికి ఆనుకుని పెదలంక ఉండడంతో పాలుకుమార్ 10వ తరగతి వరకు తాటిపాక ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇటీవల 10వ తరగతి పాసయ్యాడు. నెల రోజుల క్రితం నాన్నమ్మ గారి ఊరైన పెదలంక నుంచి అమ్మమ్మ గారి ఊరైన పి.గన్నవరం మండలం నాగుల్లంక వెళ్లాడు. ఈ నెల 24వ తేదీన పాలుకుమార్ పెదలంక వచ్చి మళ్లీ అమ్మమ్మగారి ఇంటికి వెళ్లాడని నాన్నమ్మ భాగ్యవతి భోరున విలపించింది. నా కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోతే మనుమడిని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నానని కంటతడి పెట్టుకుంది. గోదావరిలో గల్లంతైన మనుమడు పాలుకుమార్ కోసం విలపిస్తున్న నాన్నమ్మ భాగ్యవతి, తాతయ్య నాగేశ్వరరావులను చుట్టుపక్కల వారు ఓదార్చారు.



గోదావరిలో గల్లంతైన నీతిపూడి పాలుకుమార్ (ఫైల్)



మనుమడు గల్లంతు కావడంతో విలపిస్తున్న నాన్నమ్మ భాగ్యవతి

ప్రమాద స్థలాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మంగళవారం రాత్రి పరిశీలించారు. స్థానిక మత్స్యకారులతో పడవలపై గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పిస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. పి.గన్నవరం తహసీల్దార్ పి.శ్రీపల్లవి, సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై బి.శివకృష్ణ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యా యత్నం



రవిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

అంబాజీపేట: బీరు సీసాను పగలగొట్టి ఆ పెంకుతో పీక కోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అంబాజీపేట శివారు జయంతినగర్‌కు చెందిన ఈతకోట రవి మంగళవారం స్థానిక బస్టాండ్ వెనుక ఓ చెట్టు వద్ద బీరు సీసా పగలగొట్టి ఆ పెంకుతో పీక కోసుకున్నాడు. అక్కడ నుంచి రక్తస్రావంతో బస్టాండ్ వద్దకు వచ్చి స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు స్పందించి 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. రవి పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఆత్మహత్యకు యత్నించడానికి గల కారణాలు తెలియలేదు.

బావిలో పడిపోయిన లేగ దూడ

రక్షించిన పిఠాపురం అగ్నిమాపక అధికారులు



అగ్నిమాపక సిబ్బంది రక్షించిన లేగదూడ

సామర్లకోట: చెంగు..చెంగున గెంతులు వేస్తూ పొలంలో గడ్డి మేస్తున్న లేగ దూడ అక్కడ ఉన్న బావిలో పడిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని నవర గ్రామ సమీపంలోని పొలంలో ఉన్న బావిలో లేగ దూడ సోమవారం సాయంత్రం పడిపోయింది. రైతులు పిఠాపురం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సుమారు 20 అడుగుల లోతు ఉన్న బావిలో పడిన లేగదూడను మూడు గంటల పాటు శ్రమించి అగ్నిమాపక అధికారులు రక్షించారు. దాంతో రైతులు గోమాత జిందాబాద్, అగ్నిమాపక సిబ్బంది జిందాబాద్ అంటూ నినాదా లు చేశారు. బావి నుంచి లేగ దూడ బయట పడటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పంట పొలాలకు, రైతులకు నీటి కోసం పూర్వీకులు అక్కడ బావి ఏర్పాటు చేసినట్టు రైతులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... నగరంలోని ప్రేజర్‌పేటకు చెందిన వనమాడి దొరబాబు (45) భార్యతో నెలకొన్న కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మా ఆందోళన ఎవరికీ పట్టదా?

- మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆవేదన
- సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 20 రోజులుగా సమ్మె
- హామీ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్ పట్టించుకోని వైనం



తమ సమస్యల పరిష్కారం కోరుతూ పాదయాత్ర చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది (ఫైల్)



పిఠాపురంలో జనసేన కార్యాలయం వద్ద కార్మికుల పడిగాపులు (ఫైల్)

పిఠాపురం: మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ఇంజినీరింగ్ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారు. అయితే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేయాలని వారు చేసిన ప్రయత్నం విఫలమయినట్లు కార్మికులు చెబుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న తమకు సరైన జీత భత్యాలు లేవంటున్నారు. తాము శ్రమ దోపిడీకి గురవుతున్నామని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేశామని కార్మికులు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 4,500 మంది ఇంజినీరింగ్ విభాగంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందిగా పని చేస్తున్నారు. విద్యుత్, తాగునీటి సరఫరా, మంచినీటి పథకాల నిర్వహణ తదితర పనులు చేస్తుంటారు. అయితే తమకు పనికి తగ్గ వేతనాలు లేవని, దీంతో జీవనోపాధి కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు నెలకు రూ.13,087 మాత్రమే వేతనం ఇస్తున్నారని చెబుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతంలో వారాహి యాత్రకు వచ్చిన సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, యువగళంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రాలు ఇచ్చామని అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్యలు పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారని చెప్పారు. కానీ మా సంగతి పట్టించుకోలేదు.

డిమాండ్లు ఇవీ..

- కార్మిక చట్టాల ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు రూ.29,200, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ. 24,500 చొప్పున జీతాలు చెల్లించాలి.
- 15 ఏళ్లు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలి
- ప్రభుత్వం ప్రకటించే 52 ఆదివారాలు, 17 దేశ జాతీయ, రాష్ట్ర పండగ దినాలను సెలవు రోజులుగా ప్రకటించాలి లేదా వేతన దినాలుగా అయినా పేర్కొనాలి.
- విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు నష్టపరిహారం, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- విధి నిర్వహణ భారంగా మారి శరీరం సహకరించని వారికి, దీర్ఘకాలిక వ్యాధులకు గురైన వారికి ప్రభుత్వం వైద్య సేవలందించాలి. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- లేబర్ యాక్టు ప్రకారం సీనియారిటీని ఎటువంటి సర్టిఫికెట్లు లేకుండా గుర్తించి టెక్నికల్ ఉద్యోగులుగా నిర్ణయించి వారికి తగిన జీతాలు ఇవ్వాలి.
- కార్మిక చట్టాల ద్వారా సంక్షేమ పథకాలు, హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలి.
- ఇంజినీరింగ్ విభాగంలో వాటర్ బోర్డును ఏర్పాటు చేయాలి. స్వయం ప్రతిపత్తి కల్పించాలి.
- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలి.

-పదవీ విరమణ తరువాత ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా గ్రాడ్యూటీతో పాటు కనీసం రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలి, లేదా వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీ నెరవేర్చాలి



వారాహి యాత్ర సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతి పత్రం ఇవ్వగా మాకు స్పష్టమైన హామీ ఇచ్చారు. కాని అధికారంలోకి వచ్చాక మమ్మల్ని పట్టించుకోలేదు. దీంతో మేము ఆందోళనకు దిగాల్సి వచ్చింది. నేరుగా కలుద్దాం అని కాకినాడ నుంచి పిఠాపురంలో జనసేన కార్యాలయానికి పాదయాత్రగా వెళితే ఆయన అందుబాటులో లేరు సరికదా బాధ్యులు కూడా కనిపించలేదు. మా సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తాం.

– ఎస్.వెంకటరమణ, యూనియన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి, కాకినాడ

శ్రమ దోపిడీకి గురవుతున్నాం



మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ఇంజినీరింగ్ సిబ్బంది శ్రమ దోపిడీకి గురవుతున్నారు. అన్ని అత్యవసర విభాగాల్లోనూ మేమే సేవలందిస్తున్నాం. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచారు.. మాకు మాత్రం పెంచడం లేదు. మా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెలో పాల్గొంటాం.

– ఉండవల్లి వీరవెంకటరమణరాజు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు, సామర్లకోట మున్సిపాలిటీ

ద్విచక్ర వాహనదారునికి ఫైన్ షాక్

డ్రైవింగ్ లైసెన్స్ లేనందుకు రూ.10 వేల జరిమానా



వాహనదారుని సెల్‌కు వచ్చిన ఫైన్ చలానా

కొత్తపేట: లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనం డ్రైవ్ చేస్తున్న వ్యక్తికి రూ.10 వేలు ఫైన్ పడింది. వివరాలిలా ఉన్నాయి... కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర సోమవారం స్థానిక కమ్మిరెడ్డిపాలెం మలుపు వద్ద సిబ్బందితో కలిసి ట్రాఫిక్ బీట్ వేశారు. ఆ సందర్భంగా స్థానిక బాలయోగిపేటకి చెందిన ఒక యువకుడు మరో ఇద్దరు వ్యక్తులను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని డ్రైవ్ చేస్తూ వెళుతుండగా ఎస్సై సురేంద్ర ఆపారు. లైసెన్స్ ఏది? అని అడగ్గా లేదని చెప్పడంతో నంబరుతోపాటు మోటార్ సైకిల్‌తో సహా అతని ఫొటో తీసి నేషనల్ ఎంవీ యాక్ట్ యాప్‌లో నమోదు చేసి ఆ వాహనదారుని పంపించేశారు. అయితే రాత్రి అతని సెల్‌ఫోన్‌కు మోటార్‌సైకిల్ డీటెయిల్స్‌తో పాటు లైసెన్స్ లేనందుకు రూ.10,035 ఫైన్ పడినట్టు మెసేజ్ వచ్చింది. ఆ ఫైన్‌ను ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఆ చలానాలో పేర్కొన్నారు. దీంతో ఆ వాహనదారుడు నిర్ఘాంతపోయాడు.

తల్లిదండ్రులకు మూడేళ్ల జైలు

కడియం: పిల్లలను శారీరకంగా చిత్రహింసలకు గురిచేసిన కేసులో కడియం గ్రామానికి చెందిన తల్లిదండ్రులు కె.దాసు, కె. కృపావతిలకు 7వ ఏజేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ పి.బాబు మంగళవారం మూడేళ్ల జైలు శిక్ష విధించారని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. వీరిద్దరిపైనా 2001లో చైల్డ్‌లైన్ టీం సభ్యురాలు ఎన్వీ లక్ష్మికి పిల్లలు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై అప్పటి ఎస్ఐ అమీనాబేగం కేసు నమోదు చేసి చార్జిషీట్ ఫైల్ చేశారని వివరించారు. కోర్టు హెచ్‌సీ కె. శ్రీనివాసరావు సాక్షులను ప్రవేశపెట్టారన్నారు. దీంతో నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష ఖరారైందని వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారన్నారు.

పోలీసులమని చెప్పి బెదిరిస్తున్న ఇద్దరి అరెస్టు

రూ.1,000 నగదు, రాయల్ ఎన్‌ఫీల్డ్, బటన్ చాకు స్వాధీనం



మీడియాతో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీఎస్పీ విద్య. చిత్రంలో నిందితులు (ముసుగు ధరించిన వ్యక్తులు)

రాజమహేంద్రవరం రూరల్: పోలీసులం అని చెప్పి హైవేపై వాహనాలను ఆపి డబ్బు దోచుకుంటున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి,, వారి వద్ద నుంచి రూ.1,000 నగదు, రాయల్ ఎన్ఫీల్డ్ వాహనం, బటన్ చాకును స్వాధీనం చేసుకున్నారు. బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి 12.10 గంటలకు దివాన్‌చెరువు ఫారెస్టు ఏరియాలో ఇద్దరు వ్యక్తులు రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై వచ్చి బొలెరో వాహనాన్ని నిలుపుదల చేశారు. రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను బొలెరో వాహనానికి అడ్డుగా పెట్టి తాము పోలీసులమని చెప్పి కత్తి చూపించి బెదిరించారు. బొలెరో వాహనం డ్రైవర్‌ను కొట్టి జేబులోని రూ.1,000 నగదు దోపిడీ చేశారు. ఈ మేరకు విజయనగరం జిల్లా పెదమానాపురంనకు చెందిన బొలెరో డ్రైవర్ కూరడ శివరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్ మురళీమోహన్ కేసు నమోదు చేశారు. అనంతరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. దివాన్‌చెరువు గ్రామశివారు పాలచర్ల రోడ్డులో మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో రాజవోలు గ్రామానికి చెందిన సిర్ర జాస్పర్‌ప్రిన్స్ ఎలియాస్ జాస్పర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామానికి చెందిన గుడిసెరాబిన్‌లను అరెస్టు చేశారు. నిందితులు గతంలో ఇదే తరహా నేరాలకు పాల్పడ్డారని డీఎస్పీ విద్య తెలిపారు. వీరిపై దారి దోపిడీ, గంజాయి కేసులు వివిధ పోలీసు స్టేషన్‌లలో ఉన్నాయని చెప్పారు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

దూబచర్లలో చోరీ

4 కాసుల బంగారం,700 గ్రాముల వెండి, రూ.10 వేల నగదు దోచుకెళ్లిన దొంగలు



శ్రీను ఇంట్లో దొంగలు పగులగొట్టిన బీరువా

నల్లజర్ల: దూబచర్ల రామాలయం కాలనీలో మంగళవారం తెల్లవారు జామున రైతు నార్ని శ్రీనివాస్ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి, ఇంట్లో బీరువాను పగుల గొట్టారు. అందులో ఉన్న నాలుగు కాసుల బంగారం, 700 గ్రాముల వెండి, రూ.10వేల నగదును దొంగలు దోచుకెళ్లారు. ఆ సమయంలో శ్రీను దంపతులు డాబాపై పడుకున్నారు. తెల్లవారి చూస్తే తలుపులు పగుల గొట్టి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

జెడ్పీ చైర్మన్ వేణుగోపాల్



అమలాపుంలో విద్యార్థుల మృతికి సంతాపం తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, జెడ్పీటీసీలు

అమలాపురం రూరల్: ముమ్మిడివరం మండలం కమిని గ్రామం వద్ద గోదావరిలో మృతిచెందిన యువకుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, అండగా నిలవాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు అమలాపురంలో మంగళవారం యువకుల మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఇటీవల చాలామంది విద్యార్థులు, స్థానికులు మృతి చెందుతున్నారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. కోనసీమ జెడ్పీటీసీ సభ్యులు, పందిరిశ్రీహరి రామ్‌గోపాల్, గెడ్డం సంపదరావు, కోనుకు గౌతమి, మట్టాశైలజ, కసిరెడ్డి అంజిబాబు, బూడిద వరలక్ష్మి, కూడుపూడి శ్రీనివాస్, కూడుపూడి భారతి, పుట్టి కూడివీర వెంకట సూర్యనారాయణ (అబ్బు), బోణం సాయిబాబా సంతాపం తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ప్రభుత్వం వారధిగా ఉండాలి

కరప: సినీ నిర్మాతలకు, ఎగ్జిబిటర్లకు మధ్య ప్రభుత్వం వారధిగా ఉండాలని లఘు చిత్రాల దర్శకుడు, నటుడు పడాల రఘు పేర్కొన్నారు. మండలం పెనుగుదురులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సినిమా రంగం బతికుండాలన్నా, కొత్త నిర్మాతలు రావాలన్నా ప్రభుత్వం వారధిగా ఉంటూ, సహకరించాలన్నారు. కొత్తగా నిర్మాతలు రాష్ట్రంలో ఏ ప్రాంతం నుంచయినా ఆన్‌లైన్‌లో బేనర్ రిజిస్ట్రేషన్, టైటిల్ రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కల్పించడంతోపాటు, సినిమా విడుదల, థియేటర్స్ ఎంపికకు ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించాలన్నారు. థియేటర్స్ అద్దె పద్ధతిలో కాకుండా 50:50 షేర్‌లో సినిమా విడుదల చేస్తే అటు నిర్మాతలకు, ఇటు థియేటర్స్ యజమానులకు మేలు జరుగుతుందన్నారు. టికెట్ ధర ఒకే శ్లాబ్‌లో రూ.120కి మించి ఉండకూడదని, పార్కింగ్ రుసుం రూ.10, తినుబండారాలు ఎమ్మార్పీ ధరలలో ఉంచాలన్నారు. సినీరంగం కొంతమంది చేతుల్లో ఉండిపోయి, ఒక ప్రాంతానికి పరిమితం అయిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాము కొనుగోలు చేసిన నరసింహ అవతారం డబ్బింగ్ సినిమా, మా మిత్రులు నిర్మించిన మరో సినిమాకు థియేటర్స్ దొరకక ఇబ్బంది పడ్డామని రఘు తెలిపారు. చిన్న సినిమాలు, కొత్త దర్శకులు, నటీనటులను గాయకులను ప్రోత్సహించేందుకు పెనుగుదురులో ఎడిటింగ్, డబ్బింగ్, రికార్డింగ్‌తో కలిపి మ్యూజిక్ థియేటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.

సీఎం పర్యటన కోసం చెట్ల నరికివేత



చెయ్యేరులో రోడ్డు వెంబడి నరికి వేసిన చెట్లు

కాట్రేనికోన: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 31 పర్యటించనున్న నేపథ్యంలో సందర్భంగా చెయ్యేరులో రోడ్డు వెంబడి చెట్లను నరికి వేస్తున్నారు. పచ్చదనం కోసం రోడ్డుకు ఇరువైపులా మహిపాలచెరువు నుంచి పల్లంకుర్రు వరకు ప్రభుత్వం మొక్కలు నాటింది.

రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల రక్షణ బాధ్యతలను మండల మహిళా సమాఖ్య చేపట్టింది. అయితే సీఎం పర్యటన సందర్భంగా రోడ్డు వెంబడి పచ్చదనంగా ఉండి ప్రయాణికులకు నీడను అందిస్తున్న చెట్లు నరివేస్తుండటంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రత్నగిరిపై పడకేసిన రక్షణ

కీలకమైన ప్రదేశాలలో కనిపించని సెక్యూరిటీ గార్డులు



రత్నగిరిపై కీలకమైన పశ్చిమ రాజగోపురం పాయింట్‌లో కానరాని సెక్యూరిటీ గార్డు



రామాలయం పక్కన గల విశ్రాంతి షెడ్డు వద్ద సెక్యూరిటీ గార్డు కూడా లేని దృశ్యం

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సెక్యూరిటీ పడకేసింది. దేవస్థానంలో కీలక ప్రాంతాలలో ఒక్క సెక్యూరిటీ గార్డు కూడా కనిపించడం లేదు. దీంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అయినా పట్టించుకునే నాథుడు లేడు.

సెక్యూరిటీ కోసం దేవస్థానం ఏడాదికి సుమారు రూ.నాలుగు కోట్లు ఖర్చు చేస్తోంది. ఇందులో ప్రయివేట్ సెక్యూరిటీ గార్డులు వివిధ చోట్ల దాదాపు 60 మంది పని చేస్తున్నారు. వీరిపై దేవస్థానం నియమించిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ కూడా ఉన్నారు. కాని వీరెవరూ సరిగా విధులు నిర్వహించకపోయినా అడిగే నాథుడు లేడు. టోల్‌గేట్ వద్ద, రత్నగిరిపై, వై.జంక్షన్‌ల వద్ద మాత్రమే సెక్యూరిటీ గార్డులు కనిపిస్తారు.

పశ్చిమ రాజగోపురం వద్ద కానరాని సెక్యూరిటీ

దేవస్థానంలో పశ్చిమ రాజగోపురం చాలా కీలకమైన చోటు. స్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల్లో 80 శాతం మంది పశ్చిమ రాజగోపురం రోడ్డు ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. అక్కడ నుంచి వంద మీటర్లు దూరంలో అన్నదానం భవనం ఉంటుంది. వాహనాల పార్కింగ్ స్థలం అక్కడకు 150 మీటర్ల దూరం. పశ్చిమ రాజగోపురం వద్దనే దేవస్థానం బస్సులు ఆగుతాయి. ఇంత ప్రాధాన్యం కలిగిన స్థలంలో కనీసం నలుగురు అయినా సెక్యూరిటీ గార్డులు ఉండాలి. కాని ఒక్కరూ కూడా ఉండడం లేదు. వ్రతాలు, కల్యాణం, ఇతర సేవా టిక్కెట్లు ఇచ్చే కౌంటర్ వద్ద కూడా ప్రయివేట్ షాపుల వద్ద పనిచేసేవారే భక్తులను నియంత్రిస్తున్నారు. అక్కడ కూడా సెక్యూరిటీ గార్డులు ఎవరూ ఉండడం లేదు. గత శనివారం విపరీతమైన రద్దీ ఉన్న సమయంలో వ్రతాల టిక్కెట్లను ఒక వ్యక్తి బ్లాక్‌లో అమ్ముతుండగా హోమ్‌గార్డు పట్టుకుని మందలించి వదిలేశారు. ఈ విషయం గుర్తు పెట్టుకుని అయినా అక్కడ సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి. కాని సోమవారం ఒక్క సెక్యూరిటీ గార్డు కూడా అక్కడ కనిపించలేదు.

రామాలయం వద్ద గల విశ్రాంతి షెడ్డులో...

రామాలయం వద్ద గల విశ్రాంతి షెడ్డు వద్ద కూడా అదే పరిస్థితి. ఇక్కడ గతంలో ఒక సెక్యూరిటీ గార్డు ఉండేవాడు. ఇప్పుడు ఒక్కరు కూడా ఉండడం లేదు. స్వామివారి సన్నిధికి విచ్చేసే సామాన్య భక్తులు స్వామివారి వ్రతాలు, దర్శనం, అన్నదానం పథకంలో భోజనం చేశాక రామాలయం వద్ద గల విశ్రాంతి షెడ్డులో సేద తీరుతారు. కొంతమంది మహిళా భక్తులు వ్రతాల సమయంలో తాము ధరించిన పట్టుచీరలు, నూతన చీరలను అక్కడ ఆరబెట్టి కొంతసేపు నిద్రపోతుండగా అదను చూసి కొంతమంది దొంగలు ఆ చీరలను పట్టుకుపోతున్నారు. ఆ షెడ్డుకు గల సెల్‌ఫోన్ చార్జింగ్ పాయింట్ల వద్ద కూడా సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి కొంత సేపు ఆదమరిస్తే చాలు ఆ ఫోన్లు ఉండవక్కడ. ఇవే కాదు భక్తుల బ్యాగ్‌లు, విలువైన వస్తువులు కూడా దొంగలు అపహరిస్తున్నారు. ఎదురుగా ఈఓ కార్యాలయం ఉన్నప్పటికీ ఈ విశ్రాంతి షెడ్డులో దొంగతనం జరగని రోజు లేదంటే అతిశయోక్తి కాదు.

ఇక్కడ రాత్రివేళల్లో వివాహాలు జరుగుతుంటాయి. ఆ సమయంలో పెళ్లి బృందాలలోని మహిళల ఆభరణాలు, నగదు కూడా చోరీ జరిగిన సందర్భాలు చాలా ఉన్నాయి. శ్రీవనదుర్గ అమ్మవారి ఆలయం ఎదురుగా గల ఉచిత డార్మెట్రీ వద్ద కూడా సెక్యూరిటీ లేదు. ఇలా చాలాచోట్ల సెక్యూరిటీ లేకపోవడంతో దొంగలు చెలరేగిపోతున్నారు. దేవస్థానం అధికారులు పశ్చిమ రాజగోపురం వద్ద, రామాలయం వద్ద గల విశ్రాంతి షెడ్డు వద్ద, ఉచిత డార్మెట్రీ వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలి. పోలీసులు కూడా ఈ ప్రాంతాలలో రద్దీ సమయాల్లో హోం గార్డులతో తనిఖీలు నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.